మరో 920 ఎకరాల్లో పంట నష్టం

- ఇప్పటి వరకు మొత్తం 3,120 ఎకరాల్లో నష్టం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ): అకాల వర్షాలతో మరో 920 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా ఉన్నదని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. ఇప్పటికే 2,200 ఎకరాల్లో నష్టం జరిగినట్టు నిర్ధారించామని, ఇప్పుడు రంగారెడ్డి, జనగాం, నిర్మల్ జిల్లాల్లో మరో 920 ఎకరాల్లో నష్టం జరిగినట్టు అంచనా ఉందని తెలిపారు. ఇప్పటివరకు 3,120 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు తెలిపారు. ఇప్పటికే మార్చి నెలలో కురిసిన వడగండ్ల వానలతో జరిగిన పంటనష్టానికి పరిహారం విడుదల చేసేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి కోరకు విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. దీనికి తోడు ఇప్పటి నష్టాన్ని కూడా లెక్కగట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈసీ అనుమతి రాగానే నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వానకాలానికి ముందు సరఫరా చేసే పచ్చిరొట్ట విత్తనాల సేకరణకు టెండర్ల ప్రక్రియను నిర్వహించుటకు అనుమతి ఇచ్చిన రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

లండన్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతి వ్యక్తి

న్యూఢిల్లీ, ఏప్రిల్ 21: భారత సంతతికి చెందిన తరుణ్ గులాటి లండన్ మేయర్ అభ్యర్థిగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. వరుసగా మూడుసార్లు మేయర్‌గా విజయం సాధించిన లేబర్ పార్టీకి చెందిన సాదిక్ ఖాన్‌పై ఆయన పోటీ పడుతున్నారు. మే 2న జరిగే ఈ ఎన్నికల్లో 13 మంది అభ్యర్థులలో 63 ఏండ్ల గులాటి ఇండిపెండెంట్‌గా పోటీలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో లండన్ వాసులు మేయర్‌తో పాటు లండన్ అసెంబ్లీకి సభ్యులను కూడా ఎన్నుకుంటారు. ఒక వ్యాపారవేత్తగా, ఇన్వెస్ట్‌మెంట్ నిపుణుడిగా తన అనుభవాన్ని వినియోగిస్తానని, లండన్‌ను 'గ్లోబల్ బ్యాంక్ ఆఫ్ ది వరల్డ్'గా తీర్చి దిద్దుతానని, పౌరుల భద్రత, లాభదాయకతతో పాటు ఉత్తమ పాలన అందిస్తానని ఆయన పౌరులకు హామీనిచ్చారు.

ధాన్యం కొనుగోళ్లలో దగా!

- 40 కిలోల తూకానికి బదులు 41 నుంచి 42 కిలోలు జోకుతున్నరు
- ఏ-గ్రేడ్ ధాన్యం తెచ్చినా కామన్ గ్రేడ్‌గా తీసుకుంటున్నరు
- మచ్చుకైనా లేని మద్దతు ధర బ్యానర్
- రైతుల ఖాతాలో పైసలు పడేదెప్పుడో?

మంచిర్యాల జిల్లా దొనబండలో వడ్లు ఆరబోస్తున్న రైతులు

మంచిర్యాల, ఏప్రిల్ 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : యాసంగి ధాన్యం అమ్ముకునేందుకు రైతులు అరిగోస పడుతున్నారు. 20 రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నా.. కాంటా కావడం లేదు. కొనుగోళ్లు ఆలస్యమైతే ఆకాల వర్షాలకు ధాన్యం తడిసిపోతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే అదునుగా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సిబ్బంది తూకంలో దోపిడీ చేస్తున్నారు. ధాన్యంలో పాల్లు ఉందని సాకులు చెబుతూ తరుగు ఎక్కువగా తీస్తున్నారు. మిల్లర్లకు లాభం చేకూర్చేలా సిబ్బంది తూకం చేయడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

నత్తనడకన కొనుగోళ్లు

ఏప్రిల్ 1న కేంద్రాలను మొదలుపెట్టినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభం కాలేదు. మంచిర్యాల జిల్లాలో 262 కేంద్రాలకుగాను ఆదివారం నాటికి 60 కేంద్రాలే మొదలయ్యాయి. నిర్మల్ జిల్లాలో 203 కేంద్రాలకు 125, ఆసిఫాబాద్ జిల్లాలో 35 కేంద్రాలకు 15, ఆదిలాబాద్‌లో అతి తక్కువగా మూడు కేంద్రాలకుగాను ఏ ఒక్క సెంటర్ కూడా ప్రారంభం కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా చూసుకుంటే 7104 కేంద్రాలను ప్రారంభించినట్టు చెబుతున్నా.. 2480 కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభించినట్టు సివిల్ సప్లయ్ శాఖ గణాంకాలు చెబుతున్నాయి.

క్షేత్రస్థాయిలో ఇబ్బందులెన్నో...

అడపాదడపా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఎన్నో సమస్యలు రైతులను వేధిస్తున్నాయి. చాలా కేంద్రాలకు గన్నీ బ్యాగ్‌లు ఇంకా సరఫరా కాలేదు. నిర్మల్ జిల్లాలో ఆదివారమే గన్నీ సంచులు సరఫరా చేశారు. ధాన్యం కొనుగోళ్లు కూడా ఆదివారం మొదలయ్యాయి. ఎట్టకేలకు ధాన్యం కొంటున్నారు అనుకుంటే ఇద్దరి ముగ్గురు రైతుల ధాన్యమే కొని మిగిలిన వారివి ఆపేశారని రైతులు బాధపడుతున్నారు. చేసిన కొనుగోళ్లలోనూ ఐకేపీ సిబ్బంది రైతులను మోసం చేస్తున్నారు. 40 కిలోల తూకం సంచికి బదులు సంచి వేసి జోకాలి... లేకపోతే నలభైన్నర కిలోలు జోకాలి. కానీ చాలా కేంద్రాల్లో 41 కిలోల నుంచి 42 కిలోలు తూకం వేస్తున్నారు. తూకం ఎక్కువ వేయడంతో పాటు ఏ గ్రేడ్ ధాన్యం తెచ్చినా కూడా కామన్ గ్రేడ్‌గానే పరిగణలోకి తీసుకుంటున్నట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమ్మిన ధాన్యం డబ్బులు కూడా ఎప్పుడు బ్యాంక్ ఖాతాల్లో పడుతాయో తెలియడంలేదని రైతులు అంటున్నారు.

నిర్మల్ జిల్లా పీచర గ్రామానికి ఆదివారం చేరుకున్న గన్నీ సంచులు

లచ్చన్న కష్టం.. జంపన్న పాలు

- 20 రోజులుగా కేంద్రంలో పడిగాపులు
- కాంటా పెట్టరు.. ధాన్యం కొనరు
- అకాల వర్షానికి తడిసిన ధాన్యం
- చెరువులోకి కొట్టుకుపోయిన సంచులు

ఈ చిత్రంలోని రైతు పేరు మాలోతు లక్ష్మణ్. ఈయనది రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేట లకావత్‌తండా. లక్ష్మణ్ నాలుగెకరాల భూమిలో రూ. లక్ష పెట్టుబడి పెట్టి యాసంగి వరి సాగు చేశాడు. దిగుబడి బాగా రావడంతో సర్కారు క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తదని సంబురపడ్డడు. 20 రోజుల కిందట వరి కోసి రంగంపేట జంపన్న చెరువు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. మూడు రోజులు ఆరబెట్టి 48 బస్తాల్లో ధాన్యం నింపిపెట్టిండు. కాంటా పెడ్తరని కండ్లు కాయలు జేసుకొని పొద్దంతా అక్కడే ఉంటున్నడు. ఇంతలో శనివారం సాయంత్రం కురిసిన వడగండ్ల వర్షానికి ఎనిమిది బస్తాల ధాన్యం కాలువలో కొట్టుకుపోయి జంపన్న చెరువులో కలిసింది. మిగిలిన 40 బస్తాలు తడిసిముద్దయినయ్. రేపోమాపో కాంటా పెడితే పైసలు చేతికొస్తయనే టైంల చేసిన కష్టం నీళ్లపాలుకావడంతో లబోదిబోమంటున్నడు. సర్కారు తడిసిన వడ్లను కొనుగోలు చేసి న్యాయం చేయాలని దీనంగా వేడుకుంటున్నడు. -వీర్నపల్లి

41 కిలోలు జోకుతున్నరు

40 కిలోల తూకం సంచికి.. సంచి తూకం వేసి వడ్లు జోకాలి. కానీ 41 కిలోలు జోకుతుండ్రు. ఇదేమిటని అడిగితే అధికారులు జోకమన్నరని చెప్పున్నరు. అధికారులను అడుగుతాం జోకుడు ఆపాలన్నా ఆపడం లేదు. సంచికి సంచి వేసి జోకాల్సినోళ్లు కిలో ఎక్కువ తూకం వేయడం సరికాదు. రైతులు కిలో ఎక్కువ జోకితే క్వింటాలు వడ్లకు సుమారు రెండు కిలోల వరకు లాస్ కావాల్సి వస్తుంది. ఐకేపీ అధికారి కూడా సంచి వేసి జోకాలని కోరితే అధికారులే ఒక కిలో ఎక్కువ జోకమన్నారని, మిల్లర్లు సంచి వేసి జోకితే తీసుకుంటలేరని చెప్పారు. తప్పనిసరి పరిస్థితుల్లో లాసైనా కూడా ధాన్యం అమ్ముకున్నాం.

- ఆకుల వెంకటస్వామి, కొత్తూర్ గ్రామం, మంచిర్యాల జిల్లా

10 రోజులైతంది వడ్లు తెచ్చి..

కొనుగోలు కేంద్రంలోకి వడ్లు తెచ్చిపోసి 10 రోజులు అవుతుంది. ఈ రోజు సంచులు తెచ్చి స్టార్ట్ చేసిండ్రు. ఇద్దరు ముగ్గురు రైతులవి జోకి మిగిలినయ్ రేపు జోకుతమని చెప్పినం. ఒకటే కాంట పెట్టి జోకుతున్నరు. 200 లారీల వడ్లు వచ్చే పెద్ద సెంటర్‌లో ఒక్క కాంట పెట్టుడేందో అర్థమైతలేదు. పోయినేడు మూడు కాంటాలు, చివరికి అందని టైమ్‌ల నాలుగు కాంటాలు పెట్టి మరీ కొన్నరు. 20 మంది హమాలీలున్నా.. కాంటాలు లేక ఎదురు చూడాల్సి వస్తున్నది. మద్ద తుధర బ్యానరే పెట్టలేదు. ఎంత ఇస్తరో తెల్వదు. ఉన్నది చెప్తే కక్ష కట్టి ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉంది.

- అరుగుల మల్లేశ్, ముథోల్ ఎడ్‌బిడ్, నిర్మల్ జిల్లా

కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్‌రెడ్డి (ఫైల్)

కష్టాల్లో రైతులు..ప్రచారంలో నేతలు

> మొదటిపేజీ తరువాయి...

మండిపడుతున్నారు. ఈ ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టవా అంటూ ప్రశ్నిస్తున్నారు. రైతులకు భరోసా ఇచ్చే నాయకుడి కోసం ఎదురుచూస్తున్నారు.

పక్క రాష్ట్రాల్లో సీఎం ప్రచారం

రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతులు ఇబ్బందులు పడుతుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి పక్క రాష్ట్రాల్లో ప్రచారానికి వెళ్లడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వడగండ్ల వానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నానా తంటాలు పడుతున్నారు. మరోవైపు ప్రభుత్వం కాంటాలలో జాప్యం చేయడం.. కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించకపోవడంతో రైతులు ఎక్కువ నష్టపోయారు. ఇవేవీ పట్టని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. రైతులను పరామర్శించి, ప్రభుత్వం నుంచి భరోసా కల్పిస్తే ఆయన ఏ రాష్ట్రంలో ప్రచారం చేసుకున్నా ఎవరూ ప్రశ్నించేవారు కాదు. ఈ నెల 17, 18న కేరళలో, 20న కర్ణాటకలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.. మొన్న మెదక్‌లో, నిన్న భువనగిరిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కనీసం అక్కడైనా అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను పరామర్శించకుండా ప్రచారానికే ప్రాధాన్యం ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి రైతులను పలకరించడం సంగతి దేవుడెరుగు... కనీస ప్రకటన కూడా కరువైంది. మూడు రోజులుగా వర్షం బీభత్సం సృష్టిస్తుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం.

పత్తాలేని పౌరసరఫరాల శాఖ మంత్రి

రాళ్ల వానతో పంటలు దెబ్బతినగా, కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నీళ్లపాలైంది. ధాన్యం విక్రయానికి కొనుగోలు కేంద్రాల్లో పడిగాపులు పడుతున్న రైతుల కష్టాలు ఒకెత్తు అయితే.. రోజూ ఆరబోసి ఎండిన ధాన్యం అకాల వర్షానికి ఒక్కసారిగా కండ్లముందే కొట్టుకుపోతుంటే అన్నదాత బాధ వర్ణణాతీతం. ఇలాంటి పరిస్థితుల్లో పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎంతో బాధ్యతగా వ్యవహరించాల్సి ఉంటుంది. తడిసిన ధాన్యాన్ని కొంటామని, కొనుగోళ్లు వేగవంతం చేస్తామని చెప్పాల్సిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పత్తా లేకుండా పోయారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మూడు రోజులుగా వర్షాలతో కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఎదురవుతుంటే...సంబంధిత శాఖ మంత్రిగా ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కనీసం స్పందించలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా పంట పొలాలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా ? ప్రభుత్వంలో పౌరసరఫరాల శాఖకు మంత్రి ఉన్నారా ? అని రైతులు సందేహాలు వ్యక్తంచేస్తున్నారు.

ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీలొచ్చేస్తున్నయ్!

2026 నాటికి తీసుకురానున్న ఇండిగో

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20: 2026 నాటికి భారత్‌లో ఎలక్ట్రిక్ ఎయిర్ ట్యాక్సీ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. అమెరికన్ కంపెనీ ఆర్చర్ ఏవియేషన్ భాగస్వామ్యంతో ఈ సేవలను అందించనుంది. ఈ సేవలు అందుబాటులోకి వస్తే ఢిల్లీ-గుర్‌గ్రామ్ ప్రయాణం కేవలం 7 నిమిషాల్లో పూర్తవుతుంది. టికెట్ ధర రూ.2 వేలు- రూ.3 వేలు మధ్యలో ఉంటుంది. తొలి దశలో ఎయిర్ ట్యాక్సీ సేవలను బెంగళూరు, ముంబైలకు కూడా విస్తరించాలని ఇండిగో, ఆర్చర్ ఏవియేషన్ భావిస్తున్నాయి. ఒక్కో ట్యాక్సీలో పైలట్‌తో పాటు నలుగురు ప్రయాణికులు ప్రయాణించొచ్చు. 30-40 నిమిషాల పాటు చార్జింగ్ పెడితే ఈ ట్యాక్సీలోని ఆరు బ్యాటరీ ప్యాక్‌లు పూర్తిగా చార్జింగ్ అవుతాయి. ఒక సారి పూర్తి చార్జింగ్‌తో 40 నిమిషాలు ప్రయాణించొచ్చు. ఎయిర్ ట్యాక్సీ సేవల ప్రారంభానికి పౌర విమానయాన డైరెక్టర్ జనరల్ అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నట్టు ఆర్చర్ ఏవియేషన్ చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ నిఖిల్ గోయెల్ తెలిపారు.

..రైతులను టచ్‌చెయ్ రేవంత్

మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామంలో ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

ప్రజా సమస్యల పరిష్కారంపై పట్టింపేది..?

- రైతుల కష్టంపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలి
- ఎకరానికి రూ. 25వేలు నష్టపరిహారం చెల్లించాలి
- మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

హన్వాడ, ఏప్రిల్ 21: రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి వచ్చి 130 రోజులైనా, ప్రజా సమస్యల పరిష్కారంపై పట్టింపేదని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని నాయినోనిపల్లి గ్రామంలో ఎండిపోయిన వరి పంటలను ఆదివారం పరిశీలించారు. పంట చేతికొచ్చే సమయంలో ఎండిపోవడంతో అప్పులెలా తీర్చాలో తెలియక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల కష్టంపై సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించాలని, ఎకరాకు రూ.25వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాయమాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. రాష్ట్రంలో వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంపీపీ బాల రాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి జిల్లా పినపాక మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద విరిగిపడిన చెట్లు

గాలివాన బీభత్సం

ఖమ్మం, నమస్తే తెలంగాణ, ఏప్రిల్ 21: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. కొన్నిచోట్ల ఇళ్లపై రేకులు, పైకప్పులు ఎగిరిపోయాయి. చెట్లు కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. వైరా మండలం దాచాపురం, గన్నవరం గ్రామాల్లో రోడ్ల వెంబడి ఆరబోసిన ధాన్యం వర్షానికి తడిసి నీటిపాలైంది. అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలో తాళ్లూరి నాగేశ్వరరావు ఇంటి గోడ కూలిపోయింది. బత్తుల రాజు ఇంటి పైకప్పు రేకులు కొట్టుకపోయాయి. పినపాక మండలం తోగ్గూడెంలో బూరిక చరణ్ పూరిల్లు పైకప్పు ఎగిరిపోయింది. ఎంపీడీవో కార్యాలయం వద్ద చెట్లు విరిగిపడడంతో నాలుగు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. బూర్గంపహాడ్ మండల కేంద్రంలో తాటి చెట్టుపై పిడుగు పడింది. కరకగూడెం, చర్ల మండలాల్లో కరెంట్ స్తంభాలు, వృక్షాలు కూలిపోయాయి. అంగారుగూడెంలో సుమారు 20 ఇళ్లు కూలిపోయినట్లు సమాచారం.



భద్రాద్రి జిల్లా పినపాక మండలం తోగ్గూడెంలో కూలిన ఇంటి పైకప్పు

నా ఎత్తుతో నీకేం పని?

'నా ఎత్తు గురించి నీకేం పని.. నేను పొడువుగా ఉంటా.. ఎట్లనన్న ఉంటా.. నా గురించి పక్కన పెట్టి రైతుల తిప్పల గురించి ఆలోచించు.. వాళ్ల సమస్యలు పరిష్కరించు' అని రేవంత్‌కు హరీశ్ హితవుపలికారు. రామాయంపేట మండలం తొనిగండ్లలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన సందర్భంలో అక్కడి రైతులు ధాన్యం కొనుగోలు చేయడం లేదని, లారీలు రావడం లేదని ఆవేదన చెందినట్లు చెప్పారు. మొలకెత్తిన ధాన్యాన్ని కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కొనుగోలు చేసిందని గుర్తుచేశారు. 'మీ హయాంలో ఘనపూర్ కాలువ తుప్పు పట్టి పోయింది, పగుళ్లు పెట్టినయ్. కేసీఆర్ హయాంలో ఘనపూర్ ప్రాజెక్టుకు మహర్దశ వచ్చింది' అని గుర్తుచేశారు. ఏడుపాయల అమ్మవారికి కేసీఆర్ రూ.100 కోట్లు కేటాయిస్తూ ఇచ్చిన జీవోను రద్దు చేసి మెదక్‌కు అన్యాయం చేసింది రేవంత్‌రెడ్డేనని విమర్శించారు. 'ఆ దుర్గమ్మ ఉసురు తగులుతుంద'ని మండిపడ్డారు. మెదక్ పార్లమెంట్ పరిధిలో యూనివర్సిటీలు, రైళ్లు వచ్చాయంటే అది కేసీఆర్ చలవేనని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ మెదక్‌కు రైలు గురించి ఎన్నడూ పట్టించుకోలేదని, కేసీఆర్ రైల్వే అధికారులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి రూ.100 కోట్లు ఇస్తేనే ఈ రోజు మెదక్‌కు రైలు వచ్చిందని చెప్పారు. మెదక్‌కు మెడికల్ కళాశాలను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వమే ఇచ్చిందన్నారు. ఇక్రిశాట్‌ను ఇందిరాగాంధీ ఇచ్చారంటున్నారని, ఇక్రిశాట్‌ను తెచ్చింది నాటి ప్రధానమంత్రి చరణ్‌సింగ్ అని గుర్తు చేశారు. బీహెచ్ఈఎల్ 1952లో ప్రారంభిస్తే ఇందిరాగాంధీ మెదక్ నుంచి పోటీ చేసింది 1980లో అని చెప్పారు. ఇలాంటి అబద్ధాలు మాట్లాడడంలో రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వాలని ఎద్దేవా చేశారు.

మంత్రులకు అహంకారం నెత్తికెక్కింది

కాంగ్రెస్ పార్టీ మంత్రులకు అహంకారం నెత్తికెక్కి వీధ్రవీగుతున్నారని, గాల్లో తేలియాడుతున్న కాంగ్రెస్ నేల మీదికి రావాలంటే బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని ప్రజలకు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. 'కొడంగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాయం తీసుకుంటా అన్నవ్.. తీసుకున్నవా? మాట తప్పడం మీ నైజం, అబద్ధాలు మాట్లాడడం మీ నైజం' అని రేవంత్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. 'వెంకట్రామిరెడ్డిని పట్టుకొని ఎక్కడి నుంచో వచ్చారంటరా? నువ్వు కొడంగల్‌లో ఓడిపోతే మల్కాజిగిరి నుంచి పోటీ చేశావు కదా?. వెంకట్రామిరెడ్డి ఈ జిల్లాలో 20ఏండ్లు పనిచేసిండు. అతడు వేరే జిల్లాకు చెందినవాడెట్లయితడు?. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కుటుంబ సభ్యులు పటాన్‌చెరువులో మా అభ్యర్థి మహిపాల్‌రెడ్డికి ఓట్లేసిండ్రు. ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఈ నియోజకవర్గ ఓటరు' అని తెగేసిచెప్పారు.

బాండ్ పేపర్ ఇజ్జత్ తీసినవ్

'రేవంత్‌రెడ్డీ.. నువ్వు బాండ్ పేపర్ ఇచ్చి ఆ బాండ్ పేపర్ ఇజ్జత్ తీసినవ్.. బాండ్ పేపర్ అంటే నమ్మకానికి ప్రతీక. ఆరు గ్యారెంటీల్లో, ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పలేదంటున్నవ్.. నిండు అసెంబ్లీ సాక్షిగా భట్టి విక్రమార్క అనలేదా?' అని గుర్తు చేశారు. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క ఎగవేత, దాటవేతలో పోటీ పడుతున్నారని హరీశ్ ఎద్దేవాచేశారు.

నేటి నుంచి సలేశ్వరం జాతర

చుట్టూ అడవి.. కొండలు.. కోనలు.. జలపాతాలు. ప్రకృతి రమణీయతకు అద్దంపట్టే నల్లమల అటవీ ప్రాంతంలో దట్టమైన లోయ గుహలో వెలసిన లింగమయ్య దర్శనం సోమవారం నుంచి ప్రారంభం కానున్నది. ఈ నెల 24వ తేదీ వరకు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే భక్తులను అడవిలోకి అనుమతించనున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ జాతర తెలంగాణ అమరనాథ్ యాత్రగా ప్రత్యేక గుర్తింపు పొందిందని, ఏటా మూడురోజులు మాత్రమే ఇక్కడ జాతర జరుగుతుందని తెలిపారు. భక్తులు కిలోమీటర్ల మేర కాలినడకన కొండలు, గుట్టలు దాటుకుంటూ సలేశ్వరం గుడివద్దకు సాహసయాత్ర చేయాల్సి ఉంటుంది. -అచ్చంపేట

కన్నెపల్లి హెడ్‌రెగ్యులేటర్ వద్ద స్టాప్‌లాగ్ గేట్లు

- ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- నిర్వహణ ఏజెన్సీకి ఇరిగేషన్‌శాఖ సూచనలు

హైదరాబాద్, ఏప్రిల్ 21 (నమస్తే తెలంగాణ): కన్నెపల్లి పంప్‌హౌస్‌కు సంబంధించిన హెడ్‌రెగ్యులేటర్ వద్ద స్టాప్‌లాగ్ గేట్లను ఏర్పాటు చేయాలని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ నిర్ణయించింది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలంటూ ఇటీవల సంబంధిత ఏజెన్సీకి, పంప్‌హౌస్ నిర్వహణ అధికారులకు సిఫారసు చేసింది. గోదావరి నది నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ ఫోర్‌బేలోకి నీటిని మళ్లించేందుకు హెడ్‌రెగ్యులేటర్‌ను నిర్మించారు. ప్రతి హెడ్‌రెగ్యులేటర్ వద్ద స్టాప్‌లాగ్ గేట్లను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. హెడ్‌రెగ్యులేటర్‌కు అమర్చిన గేట్లు ఏదైనా కారణం వల్ల పనిచేయకపోతే నీటిని నియంత్రించేందుకు స్టాప్‌లాగ్ గేట్లు ఉపయోగపడతాయి. ఈ నేపథ్యంలో కన్నెపల్లి పంప్‌హౌస్ హెడ్‌రెగ్యులేటర్ వద్ద స్టాప్‌లాగ్ గేట్లను అమర్చాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందుకు దాదాపు రూ.100 కోట్లు ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

కాంగ్రెస్ మరెన్నో రోజులు ఉండదు

- వందరోజులైనా నెరవేరని హామీలు
- సౌకర్యాలు లేని కొనుగోలు కేంద్రాలు
- రేవంత్‌రెడ్డిని ప్రజలు ఛీ కొడతారు
- సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు
- మెదక్‌జిల్లా తొనిగండ్ల, పెద్దకోడూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

రామాయంపేట/సిద్దిపేట, ఏప్రిల్ 21: ప్రజలను మోసం చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ మరెన్నో రోజులు ఉండదని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జోస్యం చెప్పారు. మాట ప్పిన కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఆదివారం మెదక్ జిల్లా రామాయంపేట మండలం తొనిగండ్ల, చిన్నకోడూర్ మండలం పెద్దకోడూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి మహిళా రైతుల కష్టాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ఇచ్చిన హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామన్న రేవంత్‌రెడ్డి నాలుగు నెలలైనా అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను నిలువునా మోసం చేసిన సీఎం రేవంత్‌ను ప్రజలు ఛీకొడతారని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 15 రోజులు దాటినా ధాన్యం తూకం వేయడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వర్షాలకు తడిసిన ధాన్యం మొలకెత్తుతున్నా అసలత్వం పనికిరాదని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన వసతులు లేక రైతులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను అరిగోస పెడుతున్న రేవంత్ సర్కారు ఎంతోకాలం నిలవదని తెలిపారు.



సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్ మండలం పెద్దకోడూర్ గ్రామ శివారులో మెట్టుబండల వద్ద మహిళా రైతుతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

తొందరపడి ధాన్యం అమ్ముకోవద్దు

రైతులకు తాము అండగా ఉంటామని, ఎవరూ అధైర్యపడొద్దని, తొందరపడి ధాన్యాన్ని తక్కువ ధరకు విక్రయించవద్దని హరీశ్‌రావు రైతులను కోరారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రుణమాఫీ చెయ్యలేదని, రైతుబంధు ఇవ్వలేదని, బోనస్ రూ. 500 ఎగ్గొట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ తమ బాధలను హరీశ్‌రావుకు చెప్పుకున్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు అన్నీ ఇచ్చిండని, ఇప్పుడు ఏమీ లేవని ఓ మహిళా రైతు వాపోయింది. మోహన్‌రెడ్డి అనే మరో రైతు మాట్లాడుతూ కరెంటు తిప్పలతో మోటార్ కాలిపోయి రూ. 22 ఖర్చు అయిందని, రైతుబంధు రాలేదని ఆవేదన వ్యక్తంచేశాడు. కేసీఆర్ సార్ ఉన్నప్పుడు మంచిగుండె సార్ అని పేర్కొన్నాడు. హరీశ